# ఆత్మసిద్ధి

ఎ. యమ్. మాణిక్యశర్మ

అది యమలోకం. జీవులను వారి కర్మానుసారం యమదూతలు శిక్షలు విధిస్తూ వున్నారు. యమకింకరులు కింకరాధ్యక్షునివైపు పరుగులతో వచ్చి-

"మహాప్రభో! రక్షించండి!! ఈ జీవికి మీరు విధించిన శిక్ష వేయడం మా తరం గాదు. యిన్ని యుగాలుగా యమ కింకరులుగా పనిచేస్తున్నాము గాని ఇంత వుపద్రవం మాకు ఎన్నడూ కలుగలేదు. అది ఏమి మాయోగాని వీణ్ణి చేతులతో అగ్నిగుండంలో తోద్దామంటే వీణ్ణి ముట్టుతుంటే మా ప్రాణాలు పోయేట్టుగా వున్నాయి. మీరు మాకు ప్రసాదించిన ఆయుధాలతో అగ్నిగుండంలో తోద్దామంటే ఆయుధాలు వీడికి గజందూరంలో ఆగిపోతున్నాయి. పోనీ పాశాలతో లాగి అగ్నిగుండంలో వేద్దామంటే పాశాలు వీడికి తగులగానే భగ్గున మండిపోతున్నాయి. ఏమిచేయాలో తోచడంలేదు. మమ్మల్ని కనికరించండి" అని ఆందోళనతో కేకలు వేయసాగారు.

"యింకా నయం నా దగ్గరకు వచ్చారు! మన ప్రభువులు యమధర్మరాజుగారు గనుక యీ సంగతి వింటే ఇంక ఏమైన వుందా? వీడు అగ్నిగుండంలో ఎందుకు పడడో నేను చూస్తాను" అని కింకరాధ్యక్షుడు యింకా భయంకరులైన భటులతో ఆయుధాలతో బయలు దేరాడు. అతని ప్రత్యేక అనుచరులు ప్రత్యేక ఆయుధాలతో నెట్టబోయారు.

చిత్రంగా శిక్షకు గురిచేయబడిన జీవికి గజం దూరంలో అన్ని ఆయుధాలు ఆగిపోయాయి. ముందుకు చొచ్చుకొని పోవడంలేదు. నిర్ఘాంతపోయాడు కింకరాధ్యక్షుడు. జీవి నవ్వుతూ నిలుచున్నాడు గాని నోరు విప్పలేదు. యమలోకంలో నవ్వుతూ నిలబడగలిగిన ఒక జీవిని, పైగా ఆయుధాలు పని చేయడం జరగని విషయాన్ని చూచి, కింకరాధ్యక్షుడు నిర్ఘాంతపోయాడు.

"ఒరేయి! వీడు మొండిఘటంలా వున్నాడు. మన అయ్యవారు దయచేసిన విశేష పాశాలు తీసుకొనిరండి. దానితో వీడిపని సరి" అని గర్జించాడు.

"యివిగో ప్రభూ!" అంటూ కింకరులు విశేషంగా తయారు చేసిన పాశాలు యిచ్చారు! 'యిహ వీడిపని సరి' అని అధ్యక్షులు పాశాలు విసిరాడు. ఆ జీవికి పాశాలు తగిలీతగలగానే అవి భగ్గున మండి బూడిదయిపోయాయి. కింకరాధ్యక్షునికి ఆశ్చర్యం కలిగింది. వెంటనే కోపంతో చిందులు తొక్కుతూ ఆ జీవిని సమీపించి చేతులతో అగ్నిగుండంలోకి తోసివేయబోయాడు.

జీవికి చేతులు తగులగానే 'కెవ్వు' మంటూ కేకపెట్టి కిందపడిపోయాడు. కొన్ని క్షణాల తరువాత తెప్పరిల్లి లేచి నిలుచున్నాడు. జీవి నవ్వుతున్నాడుగాని పెదవి విప్పలేదు. కింకరాధ్యక్షుడు వెనక్కు తిరిగి గుడ్లు ఉరుముతూ కింకరులను చూచి "ఓరి మూర్ఖుల్లారా! యీ జీవిని యమలోకానికి రావలసినవాడా లేక దేవలోకానికి పోవలసినవాడా? యిక్కడికి ఎలా తెచ్చారు? మన చిత్రగుప్తులవారు యీ జీవిని పరిశీలించి శిక్ష విధించారా? యిన్ని యుగాలుగా చూస్తున్నాము. యిటువంటి ఘోర ప్రమాదం మనకు ఎప్పుడూ జరగలేదే! ఏడేడు పధ్నాలుగు లోకాలలో యమలోకంలో తప్పించి మిగతా అన్నిచోట్ల పొరపాట్లు జరుగుతాయి. ఇలా ఎన్నడూ జరుగలేదే! నిజం చెప్పండి" అని గద్దించాడు.

భయకంపితులైన కింకరులు "మహా ప్రభో! విధి నిర్వహణలో అణుమాత్రం కూడా లోపం లేదు. ప్రతిచోటా యీ జీవి యిలాగే నవ్వుతూ నిలుచుంటాడు. నోరు మెదపడు" అని బదులు చెప్పారు.

కింకరాధ్యక్షుడు కాసేపు తలపట్టుకు కూర్చున్నాడు. కొద్ది క్షణాల తరువాత మెరుపులాంటి ఆలోచన వచ్చింది. గబగబ జీవిని సమీపించి నమస్కరించి "మహానుభావా! అన్ని లోకాలలో పొరపాట్లు జరుగుతాయి కాని యిక్కడ అటువంటి పొరపాట్లు జరుగవు. మాకు శిక్షను అమలు చేయడంలో సహకరించి మీకు విధించిన శిక్షను మీరు స్వయంగా అమలుపరుచుకోమని నా ప్రార్థన. మేము మిమ్మలను సమీపించలేకున్నాం. అదిగో అగ్నిగుండం దయచేసి దూకండి" అని సాష్టాంగ పడిపోయాడు. అతనితోపాటు కింకరులూ.

జీవి పెదాలు విప్పి మాట్లాడబోయాడు. తొంభైతొమ్మిది కోట్ల జీవరాసుల భాషలు తెలిసిన ఆ కింకరులకు, అధ్యక్షుడికి ఏమీ బోధపడక బిక్కమొగం వేశారు. 'పదమన్నట్టు' సైగల వలన తెలుసుకొని అందరూ అగ్నిగుండంవైపు దారితీశారు. అందరూ బారులు తీరి నమస్కరిస్తూ 'దూకండి మహాప్రభో' అని ప్రార్థించారు

జీవి ప్రతినమస్కారం చేస్తూ 'దభీమని' గుండంలో దూకాడు అమ్మయ్య గొడవ వదిలింది అని

అందరూ విట్టూర్చారు. కాని చిత్రంగా యింతలో ఆ జీవి చెక్కుచెదరకుండా దేదీప్యమానంగా వెలుగుతూ బయటకు వచ్చాడు. అక్కడి కింకరులకు నోట మాట రాలేదు. తరతమ బేధం లేకుండా ఆ వింతజీవికి అందరూ పాదాభివందనం చేశారు. అతన్ని ముందుంచుకొని యమధర్మరాజు వద్దకు వచ్చి "మహా ప్రభో యమధర్మరాజా? రక్షించండి" అని గగ్గోలుగా కేకలు పెట్టారు.

"ఆపండి కేకలూ! ఆర్తనాదాలు! ఏమి జరిగింది" అని యమధర్మరాజు గర్జించాడు.

కింకరు లందరూ సాష్టాంగపడ్డారు. అధ్యక్షుడు "రక్షించండి మహాప్రభో! ఈ జీవికి మీరు విధించిన శిక్ష అమలు చేయడం వీలుగాలేదు. యితనిని మేము తాకలేకుండా వున్నాము. ఆయుధాలు గజం దూరంలో ఆగిపోతున్నాయి. పాశాలు తగిలితే పండిపోతున్నాయి. అయినా మా విన్నపాన్ని మన్నించి తనకు తానే స్వయంగా అగ్నిగుండంలో దూకాడు. అలనాటి సీతామహాదేవిలా చెక్కుచెదరకుండా పరిణితి చెందకుండా పైకి వచ్చాడు. యిన్ని యుగాలుగా యిక్కడ వున్నా యీ వింత ఎరుగము, తమరి ఆజ్ఞ సెలవీయండి" అని నమస్కరించారు.

యమధర్మరాజు మండిపడ్డాడు. "ఏమిరా పాతకీ!" అంటూ యమదండాన్ని చేతికితీసుకొని ఆ జీవిమీదకు విసిరి వేశాడు. యమదండం మాత్రం ఆ జీవిని తాకి మరల తన స్థానానికివచ్చి వుండి పోయింది. యముని కోపానికి అంతు లేదు. జీవి చెక్కుచెదరలేదు. మితిమీరిన కోపంతో మరియొకసారి యమదండం ప్రయోగిద్దామని యమదండాన్ని చేత్తో తాకాడు. అంతే!

"మహాదేవా!" అని పెద్ద కేకవేసి చేయి లాక్కుని మూర్ఛపోయాడు. కింకరులూ సభికులూ అచేతనులై పోయారు. కొద్దిసేపు తరువాత తేరుకొని జీవివంక తదేకంగా చూచాడు. వెంటనే మహోగ్రుడై "చిత్రగుప్తా! ఏమిటి యీ పొరపాటు. నీ అభియోగాలు తప్పు. యీ విధంగా యమలోకం ఎన్నడూ జరుగ లేదు. ఎవరినైనా పుణ్యాత్మునికి నీ తప్పు అంటగట్టావా? యీ జీవి మహానుభావునివలె నున్నాడు. యీ పొరపాటు ఎందుకు జరిగింది? అందుకు నీవు బాధ్యత వహించాలి! మరియొకసారి యీతని విషయం పరిశీలించి తెలియజేయి. పొరపాటు జరిగిందా నీకు తెలుసుగా కఠినశిక్ష, పదవీచ్యుతి" అని గర్జించాడు.

"శాంతించండి మహాప్రభో" ఇదిగో అతని జీవితపత్రం. తమరే స్వయంగా పరిశీలించండి" అని పత్రాన్ని అందించాడు చిత్రగుప్తుడు.

యమధర్మరాజు స్వయంగా పత్రాన్ని

చదివి వినిపించి "యిన్ని నేరాలు నీవు చేసినవేనా? నిజం చెప్పు" అని గద్దించాడు. జీవి ఏదో చెప్పబోయాడు. జీవి మాటలు యమధర్మరాజుకు అర్థం కాలేదు.

"నిజమయితే మాట్లాడవేమి" అని గద్దించాడు యముడు.

"ప్రభూ వీడిబాషకు మనకు సాపత్యం లేదు" అని అధ్యక్షుడు సెలవిచ్చాడు. తప్పులు నిజమేనని సైగలద్వారా తెలియజేశాడు జీవి.

యమధర్మరాజు శాంతించి "చిత్రగుప్తా! నీవు చెప్పింది నిజమే! జీవి కూడా తన నేరాలు ఒప్పుకున్నాడు. మన శిక్షా స్మృతి ప్రకారం శిక్ష గూడా సరిపోయింది. కనుక మరి యీ జీవిని ఏమి చేయాలి?" అని ప్రశ్నించాడు.

"ప్రభువుల కొలువు కత్తిమీద సాము వంటిది. సరిగా లెక్కలు రాయకపోతే పదవీ పరిత్యాగం. తప్పులు రాస్తే దేవర శిక్ష విధిస్తారు. తమకు నా పనిమీదే ఎప్పుడూ అనుమానం. ప్రపంచంలో సమస్తదేవతలూ ఏదో విధంగా తప్పులు చేస్తూనే యున్నారు. యిన్ని యుగాలుగా పనిచేస్తున్నా నా లెక్కలవల్ల తప్పులు జరుగలేదు, జరగవు. జరగబోవు. ఇంకా మీ వల్ల గతంలో పొరపాట్లు జరిగాయి. సతీసావిత్రికి వరాలు యివ్వడంలో మీరు పొరపాటు చేశారు. శ్రీకృష్ణునికి జడిసి ఆయన గురుపుత్రుని తిరిగి పప్ప జెప్పారు. అయినా అడిగినారు గనుక మనవి చేస్తున్నాను. యమలోకంలో యింతవరకూ పునర్విచారణ ప్రసక్తి లేదు. నా అభియోగాల వివరాలలో పొరపాట్లు రాలేదు. శిక్షా నిర్ధారణలో దోషం లేదు. శిక్షానిర్వహణ మనవారికి చేతకాకపోయినా జీవి వారికి సహకరించి స్వయంగా అగ్నిగుండంలో దూకినాడు. కనుక మీకు మరల శిక్ష విధించే అధికారం లేదు. పైగా తగుదునమ్మా అని యితని దోషం లేకపోయినా మీరు యమదండం ప్రయోగించి అకారణంగా శిక్షించి అధికార దుర్వినియోగానికి పూనుకున్నారు. ఇది మీ తప్పిదాలలో జమ చేయదగినది. యీ జీవిమీద ప్రస్తుతము మీకు పరిపాలనా పరిధి లేదు అని నా అభిప్రాయం" అని చిత్రగుప్తుడు యుక్తియుక్తంగా అక్కసు వెళ్ళబోసుకున్నాడు.

"సరేలేవయ్యా అయితే యితనికి మరల ఏ జన్మ ఎత్తాలో చెప్పు. దానికి పంపుదాము" అని విసుక్కున్నాడు యమధర్మరాజు.

"అగ్నిగుండంలో తప్తమయిన జీవికే మరియొక జన్మనిచ్చే అధికారం మనకుంది. యీ జీవి తప్తంకాలేదు గనుక కర్మపరిపాకం పూర్తిగాలేదు. యితనికి మరో జన్మ యివ్వడానికి వీలు లేదు. మన పరిధిలోకి రాదు. తమరు పెద్దలను సంప్రదించటం మంచిది" అని చిత్రగుప్తుడు అన్నాడు.



యమధర్మరాజుకు యిప్పుడు సమస్య జటిలంగా తోచింది. చిత్రగుప్తుడు యదార్థమే తెలిపాడు. ఆవేశపడి ఆనాలోచితంగా యమదండం ప్రయోగించాడు. తమ లోకంలో శిక్ష విధింపు సరిగానే వుంది. జీవి అన్నింటికీ ఒప్పుకొన్నాడు. చిత్రగుప్తుని శిక్ష సరిగానే వుంది. తమతో స్వయంగా సహకరించి శిక్ష అనుభవించాడు. అగ్నిగుండంలో తప్తుడుగాలేదు గనుక పునర్జన్మ యివ్వలేము. సరే యిలా జరగడానికి కారణం చూద్దాము అని జీవిని చూస్తూ దివ్యదృష్టి సారించాడు.

జీవియొక్క మానవజన్మ వివరాలు అన్ని తెలిశాయి. కాని భాష అర్థంకాక పోవడానికి, జీవికి మానవజన్మాంతం ఎలా జరిగిందో విశదంకాలేదు. యమునికి ఆ విషయం అతీతంగా వుండిపోయింది.

"చిత్రగుప్తా! యీతని విషయం వింతగానే వుంది. యితని విషయం బ్రహ్మతో సంప్రదిస్తాను" అని యమధర్మరాజు బ్రహ్మవద్దకు వెళ్ళాడు.

సత్యలోకంలో బ్రహ్మ లేరు, సరస్వతీదేవి లేరు. ఆ లోకం అంతా అల్లకల్లోలంగా వుంది. అందరూ భయకంపితులై వున్నారు. యీ పరిస్థితి చూచి యమధర్మరాజు చాలా కంగారుపడిపోయాడు. విచారించగా బ్రహ్మ సరస్వతీదేవితో గూడా పరమేశ్వరుని వద్దకు వెళ్ళారని తేలింది. కారణం తెలియరాలేదు. యముడు కైలాసం బయలుదేరాడు.

కైలాసం చూచి యమధర్మరాజు చాలా ఆశ్చర్యపడ్డాడు ఎప్పుడు మంచుతో కప్పబడివుండే కైలాసం ఉక్కగా ఉంది. మంచు కరిగిపోతున్నది. పరమేశ్వరుడు బ్రహ్మను చూచి "బ్రహ్మదేవా!

యీ విపత్తుకు కారణమేమిః ఎంతో ఆహ్లాదంగా వుండే యీ హిమవత్పర్వత ప్రాంతం యిలా కరిగిపోతున్నదేః కలియుగంలో ప్రథమ పాదంలో వున్నామేః యిది ప్రళయానికి సమయం కాదు గదా యీ వింతకు కారణం చెప్పగలరాః" అని ప్రశ్నించాడు.

"మహాదేవాః నాకూ అంతుదొరకడం లేదు. నా లోకమైన సత్యలోకం గూడా అల్లకల్లోలంగా వుంది. ఏమి చేయాలో తోచడంలేదు. ఇంతలో మీ ఆజ్ఞ విని యిలా యిద్దరమూ దయచేశాము" అని సెలవిచ్చాడు బ్రహ్మ.

"మహాదేవాః శరణుః శరణుః అని ప్రణమిల్లాడు యమధర్మరాజు,

పరమేశ్వరుడు ఆశ్చర్యపోతూ "యమధర్మరాజాః నీకు వచ్చిన ఆపద ఏమిటిః" అని ప్రశ్నించాడు.

యమధర్మరాజు తన లోకంలో జరిగిన వింత, యమదండ ప్రయోగ వైఫల్యము, తనకు కలిగిన బాధ, అగ్నిగుండంలో జీవుడు తప్తుడు కాకపోవడం, పునర్జన్మ ప్రసాదించడానికి చిత్రగుప్తుని అభ్యంతరం, శిక్ష అమలుచేయకపోవడం వలన యమలోకం పరిధి లేకపోవుట, తన అసహాయస్థితి అంతా వివరంగా తెలిపాడు.

"చిత్రంగా వున్నదేః ధర్మరాజాః చిత్రగుప్తుని అభిప్రాయంతో నేనుకూడా ఏకీభవిస్తున్నాను. ఒకసారి మాత్రమే నీ లోకంలో శిక్ష విధించాలని శాస్త్రము. శిక్షాపరిత ప్తుడై పునీతుడు గానివాడు పునర్జన్మకు అనర్హుడు. విషయం నీ పరిధి దాటింది. దీని విషయంలో మాకు గూడా వీలు కల్పించుకోడానికి ఆస్కారం లేదు. దివ్యదృష్టివలన నీకు తెలిసిందేమిటిః" అని ప్రశ్నించాడు పరమ శివుడు.

"సామీః అది కూడా ప్రయత్నించాను. ఆ జీవికి అంతం ఎలా జరిగిందీ నాకు అందడంలేదు. జీవిని ప్రశ్నిస్తే ఏదో చెపుతున్నాడు గాని మనకు తెలిసిన ఏ భాషలోనూ అర్థంకావడంలేదు. సైగలవలన తెలియజేయ ప్రయత్నిస్తున్నాడు గాని బోధపడటం లేదు. ఏమి చేయవలయునో సెలవీయండిః" అని ప్రార్థించాడు యముడు.

"విషయం చాలా విషమంగా వుందేః నేను మూడవకన్ను తెరిచి ఆ జీవిని భస్మంచేయగలను. దానివల్ల చిక్కు ఏమిటంటే మరల నేను వానికి వరం ప్రసాదించాలేః లేకపోతే వాడికి యిహ జన్మ లేదు. యిటువంటిది మన్మధుని విషయంలో జరిగింది. అయితే లోకోపకారార్థం అతనికి నేను పునర్జన్మ వరం ప్రసాదించాను. యితని విషయంలో అలాకాదేః శిక్ష విధింపు జరుగు కార్యక్రమం అసంపూర్తి అయింది. బహుశ ఏదో విపరీతం జరిగివుండాలి. ఈ లోకం చూడు ఎంత అస్తవ్యస్తంగా

ఉందో? బహుశ వైకుంఠం కూడా ఏదో విపరీతం జరుగుతుండాలి. పదండి మనము వెళ్ళి విష్ణువును కలుద్దాం" అంటూ పరమేశ్వరుడు బయలుదేరాడు. అందరూ అనుసరించారు.

వైకుంఠంలో గురుస్థితి కూడా అల్లకల్లోలంగా వుంది. ఆదిశేషుని తలపై భూమి వేయి సూర్యుల కాంతితో వెలుగుతూంది. విపరీతమైన వేడి. శేషుడు ఆ బాధ తట్టుకోలేక విలవిలలాడిపోతున్నాడు. లక్ష్మీదేవి, విష్ణుమూర్తి శేషుని ఓదారుస్తూ సపర్యలు చేస్తున్నారు. యీ వేదికి పాలసముద్రం శగలు వస్తున్నది. యీ హడావిడిలో విష్ణువు ఎవరినీ గమనించలేదు.

"ప్రభో! శరణు శరణు!"అని పరమేశ్వరుడు, బ్రహ్మ, యముడు మొదలైనవారు ప్రణమిల్లారు. వైకుంఠంలోని పరిణామాలకు ఆశ్చర్యపోయారు. విష్ణువు అందరినీ ఆహ్వానించి "ఏమిటి విషయం?" అని ప్రశ్న వేశాడు.

"నాథా! రక్షించు! యీ బాధ తాళలేను" అని బాధతో ఆర్తానాదం చేసింది. భూదేవి. విష్ణువు వెంటనే ఆర్తనాదం విని అంతర్ధానమయి మరల భూదేవితో ప్రత్యక్షమయినాడు. ఆమె పరిస్థితి బాధాకరంగా, భయంకరంగాను వున్నది. "నాథా! యిక్కడ ఎంతో హాయిగా ఉన్నది. కాస్త ప్రాణం వచ్చినట్లయింది" అని కొంత సేదదీరింది భూదేవి.

అందరూ ముక్తకంఠంతో "దేవీ తమకు యీ దుస్థితి ఏమిటి? యిలా ఎందుకు జరిగింది?" అని ఆత్రంగా ప్రశ్నించారు.

"మహానుభావులారా! మీకు తెలియనిది ఏముంటుంది? నాకు ఆరువేల మైళ్ల దూరంలో ఉన్నట్లుంది బ్రహ్మాండం బద్దలయిన శబ్దం. ఆ వెంటనే పెను మంటలు. చెప్పనలవిగాని తాపం. ఆ పరిస్థితికి నేనే తట్టుకోలేకుండా వున్నాను జీవులు, పశుపక్షాదులు విపరీతంగా నాశనం అవుతున్నారు. ఆ బాధకే నేను తట్టుకోలేక నా స్వామిని శరణు కోరాను" అంటూ మూలిగింది భూదేవి.

"అదండీ అసలు కారణం. ఈ మానవులు మరీ తెలివిమీరి పోతున్నారు. అంతా మానవులే అయినప్పటికీ ఒకరి మీద ఒకరికి నమ్మకం పోతున్నది. ఏ క్షణాన ఎవరు చేస్తారో అని భూమి మీదనేకాక అంతరిక్షంలోకూడా ఆయుధగారాలు నిల్వచేస్తున్నారు. అందులో విషవాయువులు, రసాయన ప్రమాదకారణాలు, అణువిధ్వంసక అస్త్రాలు మొదలయిన ఆయుధాలు నిండిఉన్నాయి. ఒక ఆయుధం చాలు భూమిమీద జీవకోటి యావత్తూ నాశనం చేయడానికి. అట్లాంటివి వేల సంఖ్యలో పైగా అంతరిక్షంలో నిల్వచేశారు. అందులో ఒక మానవుడు మాత్రమే తగువసతితో నివసిస్తూ భూకేంద్రాల నుండి సంకేతాలకు

ఎదురుచూస్తూ వుంటాడు. అటువంటి ఆయుధగారం ఈరోజు ఉదయం ప్రమాదవశాత్తు పేలిపోయింది. యిప్పటి ఉపద్రవాలకు అదే కారణం" అని విష్ణుమూర్తి సాలోచనగా అన్నాడు.

"స్వామీ నాకు యింకొంత బాధ ఉపశమనం కావాలి. రక్షించరూ!" అంటూ భూదేవి దీనంగా ప్రార్థించింది.

"ఆవశ్యం" అంటూ విష్ణువు దేవశిల్పిని పిలిచి "విశ్వకర్మా నీవు వెంటనే వరుణుడికి వాయుదేవుని ప్రత్యేక రక్షణ కవచాలు యిచ్చి పంపు. వరుణుడు వాయుదేవునిపై నీళ్లు కురిపిస్తూ వుంటాడు. వాయుదేవుడు ఆ మంటలను చాలా సుదూర ప్రాంతాలకు తోసివేస్తాడు. వాళ్ళిద్దరినీ నిరపాయమైన దూరంలో వుండి పనిచేయమను, మంటల దగ్గరకు వెళితే మనం గూడా రక్షించలేము" అని అన్నారు.

విశ్వకర్మ సాయంతో వరుణుడు వాయుదేవుడు ఆ మంటలను సుదూర ప్రాంతాలకు నెట్టివేశారు. మరల వాతావరణం మామూలుగా అయింది. అందరూ సేద తీర్చుకున్నారు!

"తండ్రీ! ఆ ఆయుధాగారం పరమేశ్వరుని ముక్కంటి మంటను గూడా మించిపోయిందా?" అని ఆశ్చర్యం ప్రకటించాడు బ్రహ్మ.

"అవును కుమారా! అవి పరమేశ్వరుని ముక్కంటి మంటకు ఎన్నో రెట్లు అధికం. అంతరిక్షంలో ఒక ఆయుధాగారం అంటుకున్నది గనుకనే మనం బ్రతికిపోయాం. దీనివల్ల భూమిమీదనూ యితర అంతరిక్షంలో ఆయుధాగారాలు అంటుకోలేదు. అదే జరిగితే మన చేతులతో ఏమిచేయలేం" అని కలవిచ్చాడు విష్ణువు.

ఇదే మంచి అదను అనుకొని యమధర్మరాజు తన లోకంలో వచ్చిన జీవి గురించి, వచ్చిన యిబ్బందుల గురించి, ప్రస్తుతం సమస్య గురించి సవివరంగా తెలియపరచి కర్తవ్యం బోధించమని వేడుకున్నాడు.

చిత్రగుప్తుని పిలవమని ఆదేశించాడు విష్ణువు. చిత్రగుప్తుడు వచ్చి నమస్కరించగానే "చిత్రగుప్తా! ప్రస్తుతం మీ లోకం సమస్యగా పరిణమించిన వ్యక్తి జీవపరిసమాప్తి ఎలా జరగాలని నిర్వచించావు" అని ప్రశ్నించాడు.

"మహానుభావా! అతని అంతం మానవునిగా భూలోకానికి ఆరువేల మైళ్ళ దూరంలో హఠాత్తుగా ముగుస్తుంది" అని తెలిపాడు చిత్రగుప్తుడు.

"యిహ తెలిసిందిగా యమధర్మరాజా! ఆ జీవి మరి ఎవరో కాదు. ఈ ఉదయాన జరిగిన అంతరిక్ష ఆయుధాగారం ప్రమాదంలో మరణించిన వ్యక్తి ముక్కంటి మంటలకు ఎన్నో రెట్లు అధికమయిన మంటలలో పడి కాలిన ఆ జీవి నీ లోకంలో అగ్నిగుండంలో ఎలా

తప్తమవుతాడు. ఆ అగ్ని అతన్ని ఏమియు చేయలేదు. చిత్రగుప్తుని ఆ జీవి విషయంలో సరిగానే తెలిపాడు. అతని గురించి నేను ఆలోచిస్తాను. సమస్త దేవతలూ, నారదుడూ, సూత ముని యిక్కడే వుండిపోండి. నేను సరస్వతీదేవి, విశ్వకర్మ సత్యలోకానికి పోయి సమస్యకు పరిష్కారం ఆలోచిస్తాము" అని విష్ణువు శలవిచ్చారు.

అందరినీ తన మాయతో బంధించి విశ్వకర్మ, సరస్వతి.విష్ణుమూర్తి సత్యలోకానికి పోయాడు. "సరస్వతీ యిది పరమరహస్యం. యీ ఆయుధాగారంలో తప్తుడయిన జీవుడే అంతరిక్ష ఆయుధాగార ప్రమాదాలకు నిరోధంగా పనికి వస్తాడు. అందుకుతగ్గ ఆయుధంగా దేవశిల్పి అతన్ని నీకు యిస్తాడు నా ఆజ్ఞ అయిన తరువాత ఈ విషయం మానవులకు తెలియజేస్తే కలియుగం నాలుగు పాదాలు యిక ఏ యిబ్బందులు లేకుండా హాయిగా గడిచిపోతుంది" అని వివరించాడు.

విష్ణువు ఆజ్ఞ ప్రకారం విశ్వకర్మ యమలోకంకు వెళ్ళి ఆ జీవిని తన ప్రతిభతో ఒక ఆయుధంగా మార్చి విష్ణువుకు యిచ్చాడు. విష్ణువు సరస్వతి చేతికి యిచ్చాడు.

సరస్వతీదేవి చేతికి ఆ ఆయుధం తగలగానే ఎంత వెలుగులతో వెలుగుతూ భూలోకంలో కంప్యూటర్ల కేంద్రాలకు సంకేతాలు పంపసాగింది. యిసారి తెల్లబోవడం పాపం విష్ణువు, సరస్వతి విశ్వకర్మ వంతుగా వచ్చింది.

అంతరిక్షంలో ఆయుధాగార ప్రమాదాల నివారణం మానవులకు తెలిసిపోయింది. ఆయుధాగారంలో మానవుని పంపేముందే యిలాంటి మంటలు వస్తాయని వూహించి ఆ మానవునికి విశేష ప్రక్రియ చేశారు. దానివల్ల మనిషి భౌతికం ఎటూ దొరికే ప్రసక్తి లేదు కాని అనంతవాయువుగా మారే ఆత్మ తదుపరి ఏ పదార్థంతో కలిసినా సంకేతాలు పంపేట్టుగా మానవుని శుద్ధిచేశారు. ఈ విషయం ఇతరులకు తెలియచేయ వీలు లేకుండా వాక్కును నిరోధించే ప్రక్రియ గూడా చేశారు. అందుకే ఆ జీవి దేవతలకు గూడా ఏ భాషలోనూ తన విపత్తును తెలియజేయలేకపోయాడు. ఆత్మ పదార్థంతో చేరగానే తాను తెలుసుకొన్న విషయాలు సంకేతాల ద్వారా భూలోకంలో చేరవేసినాడు.

"బారా!" అంటూ దేవతలు ముక్కు మీద వేలు వేసుకొన్నారు విషయం తెలిసి.

తమ విజయానికి మానవులు ఆనందంతో బాణాసంచాలు కాల్చారు.